31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శనివారం, నవంబర్ 07 , 2026 పేజీలు : 8

కరువును తప్పించేందుకు

వృధా నీటిని వినియోగించాలి

రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని కరువు కోరల్లోకి నెడుతున్నారు. మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి.



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 6: రాష్ట్రం కరువుతో తల్లడిల్లుతున్నా సముద్రంలో వృధాగా కలిసిపోతున్న నీటిని ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో -మిగతా 2లో



గుడిసె నుంచి.... గృహప్రవేశం

- **రాజవ్వ జీవితంలో ఇందిరమ్మ ఇంటి వెలుగులు**
- **21 వేల కోట్ల రైతు రుణమాఫీని ఏకకాలంలో అమలు.**
- **రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు పూర్తి**
- **జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్**

చురకలు విలేకరి, రాయికల్, నవంబర్ 6: పేదింటి కలకు ప్రతిరూపం.. కాంగ్రెస్ ప్రభుత్వమని గుడిసె రాజవ్వకు ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ రూపంలో రాజవ్వకు కొత్త చిరునామా వచ్చిందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన నిగ లాస్యప్రియ -- భూమేశ్వర్,బుగ్గారం రాజు,పాలెపు లక్ష్మిగంగనర్సయ్య, అంతడుపుల లక్ష్మి రాజం ,కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన తాటి పాముల చంద్రకళ -- అంజన్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు చీర కానుకగా అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా -మిగతా 2లో

కరీంనగర్

శాంతిభద్రతలపై "కౌశిక్" ట్వీట్

కరీంనగర్ బస్టాండ్ సమీపంలో హత్య సంఘటనపై విస్మయం



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 6 : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలు పూర్తిగా గాలికి వదిలేసారని, సామాన్యులకు రక్షణ లేకుండా పోయిందంటూ.. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం సోషల్ మీడియాలో షేర్ చేయడం సర్వత్రా చర్చనీయాంశం కావడంతో పాటు సంచలనం రేపింది. కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతలపై కౌశిక్ రెడ్డి మొదటి నుండి అసంతృప్తిగా ఉన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తీరుతో పాటు పోలీసుల తీరును కూడా ఆయన తప్పుపడుతున్నారు. గతంలో సిపి గౌస్ ఆలం పై ఆయన విమర్శలు కూడా చేశారు. తాజాగా కరీంనగర్ బస్టాండ్ సమీపంలో హత్య జరిగిన ఘటనపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మరోసారి స్పందించారు. "వావ్!!! కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి ఇంతలా దిగజారిపోయిందా?" అంటూ ఎద్దేవా చేశారు."తెలంగాణ హోంమంత్రి రేవంత్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ కు అభినందనలు! నిన్న కరీంనగర్ -మిగతా 2లో



భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేయాలి

పుష్కరాల పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలి

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 6: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని, పుష్కరాల పనులు నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలైన ధర్మపురి శ్రీ ఉగ్ర నరసింహ స్వామి వారి దేవస్థానం, కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారి దేవస్థానాల పునర్నిర్మాణ పనులు, అలాగే రానున్న పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎండోమెంట్ కమిషనర్ హనుమంత రావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, సంబంధిత అధికారులతో కలిసి సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మపురి మరియు కోటిలింగాల పుణ్యక్షేత్రాల ప్రాముఖ్యత, ఆలయాల పునర్నిర్మాణానికి సంబంధించిన అంశాలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, రానున్న పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రం, కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి వారి క్షేత్రాలు తెలంగాణ రాష్ట్రంలో ఎంతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పుణ్యక్షేత్రాలని పేర్కొన్నారు. ఈ ప్రాంతాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని, అందుకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

ఆలయాల పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి....

ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి వారి దేవాలయం మరియు కోటిలింగాల కోటేశ్వర స్వామి వారి దేవాలయాల పునర్నిర్మాణ పనులను సమగ్ర ప్రణాళికతో చేపట్టాలని మంత్రి సూచించారు. ఆలయాల ప్రాచీనత, చారిత్రక ప్రాధాన్యత, సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర నియమాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.

పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష...

రానున్న పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, వైద్య సదుపాయాలు, పార్కింగ్, రవాణా సౌకర్యాలు, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు.పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని,ఘాట్ల అభివృద్ధి, స్నానాల కోసం సురక్షితమైన ఏర్పాట్లు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల అభివృద్ధితో పాటు పుష్కరాల ఏర్పాట్లను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

కామ్రేడ్ మహమ్మద్ మౌలానా మృతి కమ్యూనిస్టు

పార్టీకి,కార్మిక లోకానికి తీరని లోటు

-సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి సంతాపం

చురకలు ప్రతినిధి



కోరుట్ల,నవంబర్,06 : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు,బీడీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ మహమ్మద్ మౌలానా నవంబర్ 6వ తేదీ శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మహమ్మద్ మౌలానా మరణం కమ్యూనిస్టు పార్టీకి, కార్మిక వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు.బీడీ కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలు, చట్టాల అమలు కోసం పల్లె నుంచి ఢిల్లీ వరకు జరిగిన అనేక పోరాటాలు, ఉద్యమాల్లో మౌలానా కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ కౌన్సిల్ సభ్యుడిగా, బీడీ కార్మిక సంఘం అధ్యక్షుడిగా జీవితాంతం కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశారని గుర్తుచేశారు.ప్రధానంగా బీడీ కార్మికులు, కమిషన్ ఏజెంట్లకు జీవన భృతి అమలు చేయించాలని ప్రభుత్వంపై పలుమార్లు పోరాటాలు నిర్వహించారని, ఫలితంగా కార్మికులకు జీవన భృతి అందిందని పేర్కొన్నారు. కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పెన్షన్ పెంచాలని ఢిల్లీ వరకు వెళ్లి అనేక పోరాటాలు, ఉద్యమాలు కొనసాగించారని తెలిపారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.2000 సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీ తరపున మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై తన వార్డు ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా బీడీ ఫెడరేషన్‌తో పాటు ఏఐటీయూసీ, బీడీ కార్మిక సంఘాల నిర్మాణంలోనూ తనవంతు పాత్ర పోషించారని తెలిపారు. కీర్తిశేషులు ప్రభాకర్, కడకుంట్ల గంగారం, మహబూబ్ అలీ, సామల మల్లేశం తదితర నాయకుల అనంతరం సంఘటనా నిర్మాణ బాధ్యతలను ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేశారని పేర్కొన్నారు.గత ఏడాది ఆయన భార్య అమీనా అనారోగ్యంతో మరణించారని తెలిపారు. తాను కూడా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ కార్మికుల హక్కుల కోసం ఉద్యమాల్లో పాల్గొనేవారని గుర్తుచేశారు. ఆయన మరణం కుటుంబానికి, పార్టీకి, కార్మిక వర్గానికి తీరని లోటని పేర్కొంటూ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సంతాప సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత, ఎం.డి. ముక్రం, ఇరుగురాల భూమేశ్వర్, ఎన్నం రాధా, ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు ఏసవేణి గణేష్, ములుగురి హనుమంతు, ఎద్దండి భూమన్న, మహమ్మద్ ఉస్మాన్, రామిల్ల రాంబాబు, అందే వంశీకృష్ణ, రావడం అశోక్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు చింత భూమేశ్వర్, వెన్న మహేష్, వెన్న సురేష్, కిరణ్ తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

కరీంనగర్ శాంతిభద్రతలపై..

మొదటి పేజీ తరువాయి...పట్టణంలో మరో హత్య ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. హుజురాబాద్‌లో హత్య ఘటన జరిగి 39 రోజులు కూడా గడవకముందే కరీంనగర్‌లో మరో దారుణం జరగడం జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ యంత్రాంగం ఏం చేస్తోంది?ఇంకెంతమంది అమాయకుల ప్రాణాలు పోతే అధికారులు మేల్కొని బాధ్యత తీసుకుంటారు? బీఆర్ఎస్ నాయకులపై దృష్టి పెట్టి, అక్రమంగా కేసులు పెట్టడం లో పోలీసులు నిమగ్నమవుతున్నారు తప్ప కానీ ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై ఎందుకు అదే స్థాయిలో దృష్టి పెట్టడం లేదు? ప్రజలకు రక్షణ కల్పించడం, నేరాలను అరికట్టడం, సామాన్యులు భయం లేకుండా జీవించేలా చూడడం పోలీసుల ప్రాథమిక బాధ్యత. ఇకనైనా రాజకీయ కక్ష సాధింపు ఆరోపణలను పక్కనపెట్టి ప్రజల భద్రతపై దృష్టి పెట్టండి. నేరాలను అరికట్టండి. పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయండి. కరీంనగర్ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించండి. చాలు ఇకనైనా మేల్కొనండి! కరీంనగర్ ప్రజలకు భద్రత కల్పించండి. మా ప్రజలను కాపాడండి!" అంటూ ఆయన తన సోషల్ మీడియా అకౌంట్లో పేర్కొన్నారు. కాగా కౌశిక్ రెడ్డి.. సోషల్ మీడియాలో పోలీసు శాఖపై ఆరోపణలు చేయడం హాట్ టాపిక్ గా మారింది. గతంలో జువెలరీస్ దుకాణంలో జరిగిన దోపిడీ సందర్భంగానూ కౌశిక్ రెడ్డి స్పందించారు. వీణవంకలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జరిగిన పరిణామాలపై కూడా ఆనాడు ఆయన ఆందోళన నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించి తరచుగా ఏదో ఒక సంఘటన జరుగుతుండడం, వాటిని పోలీసు శాఖ పూర్తిస్థాయిలో అరికట్ట లేకపోవడం, పోలీసులు కూడా విచారణలో అనుకున్న స్థాయిలో ముందుకు పోకపోవడం కూడా విమర్శలకు కారణమవుతోందన్నారు.

శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం

నూతన క్యాలెండర్-2027 ఆవిష్కరణ

-భీమేశ్వరాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట

నవంబర్ 06 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్-2027ను వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తరఫున రూపొందించిన 2027 నూతన సంవత్సర క్యాలెండర్‌ను భక్తులకు ఒక్కొక్కటి రూ.100 ధరకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ క్యాలెండర్‌లో నక్షత్రాలు, ఏకాదశి తిథులు, ఉగాది పండుగ ముహూర్తాలతో పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన సమగ్ర సమాచారం, వివిధ పూజా కార్యక్రమాల వివరాలను పొందుపరిచినట్లు వివరించారు.భక్తులకు ఆధ్యాత్మికంగా, సమాచారపరంగా ఉపయోగపడేలా క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాలెండర్ల కొనుగోలును ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా మొదటి 21 క్యాలెండర్లను కొనుగోలు చేశారు.



కరువును తప్పించేందుకు...

మొదటి పేజీ తరువాయి...
కరువులో తాగు, సాగు నీరు అందించేలా కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించారని, మూడేళ్లలో పూర్తయిన ప్రాజెక్టు మరమ్మతులకు మూడేళ్లుగా అడుగు ముందుకు పడడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన ఎత్తిపోతలను అడ్డుకునేలా ఉందని, 750 టీఎంసీలు వృధా అయ్యాయన్నారు. కన్నెపల్లి వద్ద కాపర్ డ్యామ్ నిర్మిస్తే 20 వేల క్యూసెక్కుల నీరు అందుతుందని, కేవలం రూ. 100 కోట్లు ఖర్చు చేసి నీటిని ఎత్తిపోస్తే కరువును అధిగమించవచ్చని, నెల రోజుల్లో డ్యామ్ పూర్తి చేసి నెలకు 30 టీఎంసీల చొప్పున 5 నెలల్లో 150 టీఎంసీలు అందుబాటులోకి తెస్తే రాష్ట్రం కరువు నుంచి బయటపడుతుందన్నారు. ఎన్ డీఎస్ ఏ నివేదిక ప్రకారం వరద ఉధృతిలో గేట్లు దించవద్దని, మేడిగడ్డలో 7వ బ్లాక్ మరమ్మతు చేయాలని, అన్నారం, 6 బ్లాకుల్లో నాణ్యత సమస్యలు లేవని, సుందిళ్లలో నాణ్యత ప్రమాణాలు స్థిరంగా ఉన్నాయని పేర్కొందని తెలిపారు. అన్నారం గేట్లు ఎత్తితే నీళ్లు ఎలా ఎత్తిపోస్తారనే సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. సీతారాం ప్రాజెక్టుకు ఒక నియమం, కన్నెపల్లికి ఒక నియమమా అని ప్రశ్నించారు. ఆరుతడి పంటలు సాగు చేయాలంటున్న ప్రభుత్వం డ్రిప్ సౌకర్యం కల్పించడం లేదని, ఎకరానికి రూ.30 వేలు ఖర్చయ్యే రెయిన్ డ్రిప్ కు రాయితీ ఇవ్వాలని, రైతు భరోసా ఫేక్ మెసేజ్ లు కాకుండా వెంటనే ఖాతాల్లో వేసి రాయితీపై విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కు పేరు వస్తుందనే మూర్ఖపు ఆలోచనతో రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని కరువు కోరల్లోకి నెడుతున్నారని విమర్శించారు. జగిత్యాల పాత ఎమ్మార్వో భవనం కూల్చిన స్థలంలో పెట్రోల్ పంపు ఏర్పాటుతో మిగిలిన రెండెకరాల విలువ పోతుందని, కొత్త బస్టాండ్ వద్ద పెట్రోల్ బంక్ పై ఏడాదిగా సివిల్ కోర్టుకు వెళ్లాలని చెబుతున్నా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, నాయకులు మునీరోద్దీన్ మున్నా, నల్ల స్వామిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, దేవేందర్ నాయక్, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, కొయ్యడి మహిపాల్, దుర్గయ్య, సర్పంచులు సురేందర్, మహేష్, రూప, రాధాకిషన్, ధర రమేష్, అశోక్, మల్లేశం, గంగాధర్, గంగారెడ్డి, బారి బాయ్, సాయి, వేణు, ప్రణయ్, నక్క జీవన్, గుండ మధు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె నుంచి.... గృహప్రవేశం

మొదటి పేజీ తరువాయి...
ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పూర్తి కానున్నాయని అన్నారు.ఇటిక్యాల గ్రామానికి చెందిన రాజవ్వ పేదరికంలో గుడిసెలో నివసించేదని, గ్రామస్తులు ఆమెను ప్రేమగా గుడిసె రాజవ్వ అని పిలిచేవారని తెలిపారు. అలాంటి రాజవ్వకు ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు మంజూరై నేడు సొంతింటిలో గృహప్రవేశం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎంతోమంది పేదల సొంతింటి కల నెరవేరడం అభినందనీయమని పేర్కొన్నారు.జగిత్యాల నియోజకవర్గంలో 3,360 ఇళ్లు మంజూరు కాగా, దాదాపు 2 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాస్తున్నాయని త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని అన్నారు.ఎల్ నీ నో ప్రభావం,కరెంట్ లోటు ఉన్నా పేద ప్రజలకు 200యూనిట్ల ఉచిత కరెంట్ అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుందన్నారు.1969లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రభుత్వం 14 ప్రధాన వాణిజ్య బ్యాంకులను జాతీయకరణం చేసిందని గుర్తు చేశారు. ఇటిక్యాల-- రామారావుపల్లి రోడ్డు బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయ్యాయని, అప్రోచ్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చెక్‌డ్యాం పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు సమాన ప్రాధాన్యతతో కొనసాగుతున్నాయని అన్నారు. గత రెండేళ్లలో నాలుగు పంటలకు సంబంధించి రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని, రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీని ఏకకాలంలో అమలు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం పెంచి అందిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ నెలలో జీరో శాతం వర్షపాతం నమోదైనప్పటికీ, ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరత ఏర్పడే పరిస్థితుల్లోనూ రైతులకు చివరి దశ వరకు సాగునీరు, విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. విద్యుత్ కొనుగోలులో ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ పేద ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మెన్ రవీందర్ రావు, సింగల్ విండో చైర్మన్లు ఏనుగు మల్లారెడ్డి,మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, నిమ్మల శేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు సామల్ల వేణు, ఏలేటి జలంధర్ రెడ్డి, గన్నె రాజిరెడ్డి,సురేందర్ నాయక్,మహేందర్,సర్పంచులు మోహన్,ప్రసాద్, మల్లేశం,గుమ్మడి భూమయ్య, జగన్,మోహన్ రెడ్డి, నల్ల పవన్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్ వాడీలో ఆరోగ్యలక్ష్మి కమిటీ సమావేశం



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 6 : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి అంగన్ వాడీ కేంద్రం-2లో ఆరోగ్యలక్ష్మి కమిటీ చైర్మన్ కట్ట రాజేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రతి నెలా పిల్లల బరువు,ఎత్తు కొలిచి పెరుగుదలను గమనించాలని,గర్భిణీలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం 7 నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు టీహెచ్ఆర్ పంపిణీ చేశారు.సీబీఈ ఈవెంట్ లో భాగంగా 3 ఏళ్లు నిండిన బాబుకు అక్షరాభ్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట రాజేందర్,ఉప సర్పంచ్ అగునూరి గంగరాజం, గ్రామ కార్యదర్శి హుమేరా,మాజీ ఎంపీటీసీ కర్నే భూమారెడ్డి,అంగన్ వాడీ టీచర్లు సంకోజు పద్మారాణి,జమున,ఆశా కార్యకర్త హేమలత,గర్భిణీలు,బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా మహేష్



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (06) : మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా ఇబ్రహీంపట్నం మండలం దబ్బ గ్రామనికి చెందిన బైనా మహేష్ పటేల్ శుక్రవారం నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరి శంకర్ పటేల్ చేతుల మీదుగా బైనా మహేష్ పటేల్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన బైనా మహేష్ పటేల్‌కు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. సంఘం బలోపేతానికి, మున్నూరు కాపుల ఐక్యతకు, సామాజిక అభివృద్ధికి ఆయన తన వంతు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బైనా మల్లేష్ పటేల్, తేలు మారుతి పటేల్, బెల్లాల గంగాధర్ పటేల్, కోలా రాజేందర్ పటేల్, మార్గం నరేష్ పటేల్, దేశెట్టి భూమేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి రిమాండ్

చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 6 : చెక్ బౌన్స్ కేసులో కోర్టుకు సక్రమంగా హాజరు కాని నిందితుడికి మెట్ పల్లి కోర్టు రిమాండ్ విధించింది. ఫిర్యాదుదారు తరపు న్యాయవాది పసునూరి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం మల్లాపూర్ మండలం హుస్సేన్ నగర్ కు చెందిన షేక్ అలీ, మెట్ పల్లికి చెందిన గుంటుక ప్రసాద్ వద్ద 2023లో రూ. 3.50 లక్షలు అప్పు తీసుకుని ప్రామిసరీ నోట్ తో పాటు బ్యాంక్ చెక్కును హామీగా ఇచ్చాడు. గడువులోగా డబ్బు చెల్లించకపోవడంతో చెక్కును బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేక బౌన్స్ అయింది. దీంతో గుంటుక ప్రసాద్ 20-06-2023న సమ్మరీ ట్రయల్ కేసు వేయగా మెట్ పల్లి కోర్టు ఎస్టిసి (ఎస్ఐ) నం. 41/2023గా కేసు నమోదు చేసి సమన్లు పంపింది. నిందితుడు మొదట కొన్నిసార్లు హాజరైనా ఇటీవల హాజరు కాకపోవడంతో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ 20-07-2026న నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. వారంట్ అందుకున్న మల్లాపూర్ పోలీసులు నవంబర్ 5న షేక్ అలీని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినుకొండ మాధవి కరీంనగర్ జైలుకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు నిందితుడిని జైలుకు తరలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన జువ్వాడి

-రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదు
-తూకం విషయంలో అక్రమాలకు తావులేదు



చురకలు ప్రతినిధి కోరుట్ల, నవంబర్,06 : కోరుట్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోళ్లలో కటింగుల పేరుతో రైతులను మోసం చేశారని ఆరోపించారు.నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ధాన్యం తూకం విషయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించేది లేదని, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మండలంలోని మోహన్‌రావుపేట, వెంకటాపూర్, చిన్నమెట్టుపల్లి, కల్లూరు, ధర్మారం, ఐలాపూర్ తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు సర్పంచులు లతిక, నరేష్, ద్యాగ గంగాధర్, రహీం, లత, రమేష్, దొడ రంజిత్ రెడ్డి, రామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, రవీందర్, ఆయా గ్రామాల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎల్లేటి మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో దొంగతనం కేసు ఛేదన


-స్నేహితుని ఇంట్లోనే చోరీకి పాల్పడిన యువకుడు అరెస్టు



చురకలు విలేకరి,మెట్‌పల్లి, నవంబర్ 6 : ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకొని, స్నేహితుడి ఇంట్లోనే బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితుడిని మెట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి ఎస్ఐ పి.కిరణ్‌కుమార్ పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు... వివరాల్లోకి వెళితే ?మెట్‌పల్లి పట్టణంలోని రెడ్డి కాలనీకి చెందిన తలారి లావణ్య (ప్రేమలత) ఇంట్లోని బీరువా లాకర్‌లో ఉంచిన సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు (పెద్ద గొలుసు - 4.5 తులాలు, నెక్లెస్ - 2 తులాలు, కమ్మలు, బుట్టలు - 0.5 తులం, ఉంగరం- 0.5 తులం, మాటీలు - 0.5తులం దొంగతనానికి గురయ్యాయని గత నెల 14-10-2026న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ?దర్యాప్తులో భాగంగా బాధితురాలు లావణ్య తన కుమారుడైన అభినవ్ స్నేహితుడు ఇందూరి నవీన్ పై అనుమానం ఉన్నట్లు వ్యక్తం చేయడంతో పోలీసులు అతడిపై నిఘా ఉంచారు. శుక్రవారం ఉదయం చైతన్య నగర్‌లోని నవీన్ నివాసం వద్ద అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజాలు బయటపడ్డాయి. ?పోలీసుల విచారణలో నిందితుడు నవీన్ (26) నేరాన్ని ఒప్పుకున్నాడు. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న నవీన్, తన జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనానికి పాల్పడినట్లు తెలిపాడు. తరచూ స్నేహితుడు అభినవ్ ఇంటికి వెళ్లే క్రమంలో బీరువాలో బంగారం ఉండటం, దానికి తాళం లేకపోవడం గమనించిన నిందితుడు చోరీకి ప్లాన్ వేశాడు. ?అనుకున్న ప్రకారమే గత నెల 03-10-2026న మధ్యాహ్నం 12:00 గంటల సమయంలో అభినవ్ ఇంట్లో పడుకుని ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకుని బీరువాలోని బంగారు ఆభరణాలను దొంగిలించాడు. అనంతరం ఆ బంగారాన్ని మెట్‌పల్లిలోని మణప్పురం గోల్డ్ లోన్స్‌లో మూడు విడతలుగా తాకట్టు పెట్టి వచ్చిన డబ్బుతో తన అప్పులు తీర్చి, మిగిలిన డబ్బుతో హైదరాబాద్ వెళ్లి జల్సాలు చేసినట్లు విచారణలో తేలింది.నిందితుడి వద్ద నుండి దొంగతనానికి మరియు బంగారం తాకట్టు పెట్టడానికి ఉపయోగించిన సెల్ ఫోన్ తో పాటు మణప్పురం గోల్డ్ లోన్స్ రసీదులను పంచుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను మెట్‌పల్లి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు అండగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు

-సెంటర్లను ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్



చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, నవంబర్ 6 : ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండలంలోని మెట్ట చిట్టాపూర్,ఏఎస్ఆర్ తండా, ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులు అధికారులతో కలసి ఐకేపి కొనుగోలు సెంటర్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరలకు విక్రయించి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని,ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని, ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని నిర్వాహకులకూ సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్, కోరుట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, మండల వ్యవసాయ అధికారి దీపిక, ఏపీఎం జి.అశోక్, సీసీలు బి. శ్రీనివాస్, బి. అశోక్, సూరయ్య, ఏఈఓ నరేష్, ఆయా గ్రామాల సర్పంచులు సుంకేట అరుణ గంగాధర్, గుగులోత్ సురేందర్, చిలివేరి విజయ విజయ్, చిట్యాల రాజారాం, ఉప సర్పంచులు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఆయా గ్రామ సంఘాల ఓబీలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో దత్తత వివాదానికి పరిష్కారం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 6 : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దత్తత వివాదాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ప్రత్యేక చొరవతో సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. చిన్నారి భవిష్యత్తు, సంక్షేమం, చట్టపరమైన హక్కుల పరిరక్షణే లక్ష్యంగా మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం–1956 ప్రకారం జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాలల సంక్షేమ అధికారుల సమక్షంలో దత్తత ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేశారు.వివాదం కొనసాగితే చిన్నారి మానసిక ప్రశాంతత, విద్య, ఆరోగ్యం, కుటుంబ భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతుందని భావించి అధికారులతో సమన్వయం చేసి పరిష్కారం చూపారు. దీంతో చిన్నారి కుటుంబ వాతావరణంలో సురక్షితంగా పెరిగేందుకు మార్గం సుగమమైంది.వివాదం పరిష్కారం కావడంతో గతంలో దాఖలైన రిట్ అప్పీల్ ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించారు. కలెక్టర్ చొరవపై పెంపుడు తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



చురకలు ఇబ్రహీంపట్నం,నవంబర్ (06) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహాన్ని ఎంపీడీవో సీహెచ్. గణేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం,రాత్రి భోజనం మెనూను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు.అనంతరం వసతి గృహ పరిసరాలు,వంటగది,ఆహార పదార్థాల నిల్వగదులను పరిశీలించారు .సరుకుల గడువు తేదీలను తనిఖీ చేయడంతో పాటు నిల్వల రిజిస్టర్, వసతి గృహానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని,విద్యుత్‌ను కూడా అవసరమైన మేరకేఉపయోగిస్తూ ఆదా చేయాలని ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుల్ల రామకృష్ణ,వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్ఓసీ అందజేత



చురకలు ప్రతినిధి, జగిత్యాల,నవంబర్ 6 : జగిత్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ అమాన్ మెదడు సంబంధిత గాయంతో బాధపడుతూ వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. మెరుగైన వైద్యం అందేలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దయాల శంకర్, సీనియర్ పాత్రికేయులు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి

-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 6 : ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అధికారులకు సూచించారు.శుక్రవారం జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో అర్బన్ మండల అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని,వరి సాగుపై రైతులు ఆలోచించాలని,ఆరుతడి పంటలు పండించేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. వరి కోతలు ప్రారంభమయ్యాయని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని, మద్దతు ధర, మార్కెట్ డిమాండ్ పరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. గతంలో మార్క్ ఫెడ్ 10 వేల కోట్ల నష్టాల్లో ఉంటే గత ఏడాది లాభాలు వచ్చాయని తెలిపారు. పంట పొలాలకు నీరిచ్చే పరిస్థితి లేదని, తాగునీటికి మాత్రమే నీరు ఉందని, గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించి రోగాలు రాకుండా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించు కోవాలని అన్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి రోగుల తాకిడి పెరిగిందని తెలిపారు. రైతు పంట పొలాలు, కాలువల్లో నీటి సరఫరా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, సీసీ రోడ్లకు 20శాతం మాత్రమే నిధుల కేటాయింపు ఉందని,40 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెర్ప్ విషయంలో జగిత్యాల మండలానికి జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, మహిళా సంఘం భవనానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డీఎంహో షాబొద్దీన్, ఇన్ చార్జి ఎంపీడీవో వాసవి, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఎమ్మార్వో రామ్మోహన్, పీఏసీఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, సర్పంచులు సంగేపు మహేష్, గోడిసెల గంగాధర్, దావ తిరుపతి, శీలం సురేందర్, దమ్మ రాజవ్వ, మల్లారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చురకలు వీలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (06) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని ఫకీర్ కోండపూర్, యామాపూర్, ఎర్రపూర్ గ్రామలలో శుక్రవారం ఐకెపి ఆధ్వర్యం లో కోనుగోలు కేంద్రలు తహసీల్దార్ వరప్రసాద్, సర్పంచ్ లు తోట రమేష్, కనుక నాగేష్,రచన,ఎపిఎం శంకర్ లు ప్రారంభం చేశారు.రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేస్తోందని తహసీల్దార్ అన్నారు.అనతరం మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఉన్న సన్న రకాల వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందేందుకు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం విక్రయించుకునే అవకాశం ఈ కేంద్రాల ద్వారా కలుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో నాణ్యతా ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వల్ల రైతులకుధాన్యం విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, స్థానికంగానే ధాన్యం విక్రయించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సుచన చేశారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు,మహిళా సంఘాల సభ్యులు, సీసీలు, వీవోఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

"కొండగట్టు అంజన్న"సన్నిధిలో 'బసవ' చిత్ర బృందం

-అంజన్న ఆశీస్సులు తీసుకున్న యూనిట్ సభ్యులు



చురకలు వీలేకరి,జగిత్యాల, నవంబర్ 6 : అయాన్స్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 'బసవ' చిత్రం యూనిట్ సభ్యులు శుక్రవారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ చిత్రానికి అయాన్స్ రెడ్డి మాసం నిర్మాతగా వ్యవహరిస్తుండగా, కనకం వెంకట్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నటులు యాదమరాజు, తపస్వి రావు ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించనుండగా, కుర్రి, క్రాంతి రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి ధనరాజ్ లెక్కల క్రియేటివ్ హెడ్‌గా, నేలకొండ విప్లవ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, పులి రాకేష్ గౌడ్ ప్రొడక్షన్ కంట్రోలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.స్క్రిప్ట్ పూజ సందర్భంగా చిత్ర బృందం శుక్రవారం కొండగట్టు అంజనేయ స్వామిని దర్శించుకుని, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.పూజారులు చిత్ర బృందానికి గోత్ర నామధులతో అర్చన చేసి అధిర్వధించారు.K-Ramμ, KAμ, 'సమ్మతమే' వంటి విజయవంతమైన చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ప్రముఖ కెమెరామెన్ సతీష్ రెడ్డి మాసం ఈ చిత్రంతో నిర్మాతగా మారడం విశేషం.ఈ చిత్రానికి ఆయన డీఓపీగా కూడా వ్యవహరించనున్నారు.

గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కనున్న "బసవ " చిత్రం

ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాసం,జగిత్యాలలో మాట్లాడుతూ.. గ్రామీణ నేపథ్యంలో ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని సిరిసిల్ల సమీపంలోని నాగారం గ్రామంలో చిత్రీకరించనున్నట్లు వెల్లడించారు.త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను వెల్లడించనున్నట్లు వారు వివరించారు. ఈ పూజా కార్యక్రమంలో జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, సుంకేటి రామకృష్ణారెడ్డి, బూసి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బతికుండగానే శ్మశానంలో బతుకులు..!

-కొడుకు ప్రాణాల కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసిన తల్లి.. చివరకు నిలువనీడ లేక శ్మశానమే ఆవాసం!
-అనారోగ్యంతో కుమారుడు.. అప్పుల ఊబిలో కుటుంబం..
-ఆదుకోవాలని ప్రతి ఒక్కరినీ వేడుకుంటున్న అభాగ్యురాలు అమృత



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 06 : ఒకవైపు కన్నకొడుకు అనారోగ్యం.. మరోవైపు అప్పుల భారం.. ఇంకోవైపు ఉండటానికి ఇల్లు కూడా లేని దుస్థితి..! బిడ్డ ప్రాణాలు కాపాడుకోవాలనే తపనతో తనకున్నదంతా ఖర్చు చేసి, అప్పులు చేసి మరీ వైద్యం చేయించిన ఓ తల్లి.. చివరకు ఆర్థికంగా చితికిపోయి, అద్దె ఇంటికి కిరాయి చెల్లించలేక కన్నకొడుకుతో కలిసి శ్మశానవాటికలో ఆశ్రయం పొందుతోంది. బతికుండగానే శ్మశానంలో బతుకులు వెళ్లదీస్తున్న ఆ తల్లీకొడుకుల దీనగాథ ప్రతి ఒక్కరి హృదయాన్ని కలచివేస్తోంది.రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన అమృత గత ఐదేళ్లుగా వేములవాడలో నివాసం ఉంటోంది.ఆమె కుమారుడు రాకేష్ జాండిస్ వ్యాధితో అనారోగ్యానికి గురికావడంతో అతడికి మెరుగైన వైద్యం అందించేందుకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేసింది.కన్నకొడుకు ఆరోగ్యంగా తిరిగి వస్తాడనే ఆశతో అప్పులు చేసి మరీ చికిత్స చేయించినప్పటికీ రాకేష్ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడలేదు. దీంతో వైద్య ఖర్చుల భారం ఆ కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది.

కొడుకు కోసం అప్పులు.. చివరకు తలదాచుకునే చోటు కూడా కరువు

కన్నబిడ్డ అనారోగ్యంతో బాధపడుతుంటే చూడలేక,తన శక్తికి మించి అప్పులు చేసి వైద్యం చేయించిన అమృతకు చివరకు ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి.అద్దె ఇంటి కిరాయి చెల్లించలేని పరిస్థితి ఏర్పడటంతో ఇంటిని విడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మరోచోట ఆశ్రయం దొరకకపోవడంతో అనారోగ్యంతో ఉన్న కుమారుడిని వెంటబెట్టుకుని స్థానిక శ్మశానవాటికలోనే తలదాచుకుంటోంది. అక్కడే కుమారుడికి సేవలు చేస్తూ, అతడి బాగోగులు చూసుకుంటూ కాలం వెళ్లదీస్తోంది.సాధారణంగా మనిషి జీవితం ముగిసిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశానవాటిక.. ఇప్పుడు ఆ తల్లీకొడుకులకు నివాసంగా మారడం అత్యంత విషాదకరం. ఉండటానికి ఇల్లు లేదు.. చేతిలో డబ్బులు లేవు.. కుమారుడి అనారోగ్యం తగ్గలేదు.. చేసిన అప్పులు తీరలేదు. ఇన్ని కష్టాల మధ్య ఆ తల్లి సాగిస్తున్న జీవన పోరాటం మాటల్లో వర్ణించలేనిది.

ఆదుకోవాలని ప్రతి ఒక్కరినీ వేడుకుంటున్న తల్లి అమృత

తన కుమారుడి అనారోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితి, నివాసం లేక శ్మశానవాటికలో తలదాచుకోవాల్సి వచ్చిన దుస్థితిని వివరిస్తూ తనను కలిసిన ప్రతి ఒక్కరినీ అమృత దీనంగా వేడుకుంటోంది.తమ కుటుంబాన్ని ఆదుకోవాలని,తన కుమారుడు రాకేష్‌కు మెరుగైన వైద్యం అందేలా సహాయం చేయాలని,తల్లీకొడుకులకు తలదాచుకునేందుకు ఒక నివాసం కల్పించాలని కోరుతోంది. తన కొడుకు ఆరోగ్యంగా కోలుకుని తిరిగి సాధారణ జీవితం గడపాలన్నదే తన ఆశ అని ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే ఒక తల్లి తన కుమారుడితో కలిసి శ్మశానవాటికలో ఆశ్రయం పొందాల్సిన పరిస్థితి రావడం బాధాకరం.ఈ దీనస్థితిపై ప్రభుత్వ యంత్రాంగం,ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ముందుగా తల్లీకొడుకులను శ్మశాన వాటిక నుంచి సురక్షితమైన ఆశ్రయానికి తరలించి, రాకేష్ ఆరోగ్య పరిస్థితిని వైద్య నిపుణులతో పరీక్షింపజేసి మెరుగైన వైద్యం అందించాలి. అమృతకు జీవనోపాధి కల్పించడంతో పాటు వారికి శాశ్వత నివాస సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు, దాతలు కూడా మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఆ కుటుంబానికి అండగా నిలవాలి.

జాలి చూపే చూపులు కాదు.. ఆదుకునే చేతులు కావాలి

ఒక తల్లి తన బిడ్డ ప్రాణాలు కాపాడుకోవడానికి రూ.10 లక్షలు ఖర్చు చేసింది. కానీ చివరకు అదే బిడ్డతో కలిసి తలదాచుకోవడానికి ఒక గూడు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. చనిపోయినవారికి అంతిమవిశ్రాంతినిచ్చే శ్మశానవాటిక..బతికున్న తల్లీకొడుకులకు నివాసంగా మారడం సమాజంలోని ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేయాలి. అమృతకు కావాల్సింది సానుభూతి మాటలు మాత్రమే కాదు.. ఆపన్నహస్తం.రాకేష్‌కు కావాల్సింది జాలి చూపులు కాదు.. మెరుగైన వైద్యం. ఆ కుటుంబానికి కావాల్సింది తాత్కాలిక ఓదార్పు కాదు..గౌరవంగా జీవించేందుకు ఒక గూడు.తనను కలిసిన ప్రతి ఒక్కరినీ తమను ఆదుకోవాలని వేడుకుంటున్న అమృత ఆవేదన అధికారుల చెవులకు చేరుతుందా?దాతల హృదయాలను కదిలిస్తుందా?ఆ తల్లి కన్నీళ్లు తుడిచి, కుమారుడి జీవితంలో మళ్లీ వెలుగులు నింపేందుకు మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేత్రదానం చేయడం గొప్ప మానవతా దృక్పథం

-విషాదంలోనూ రెండు కుటుంబాలు తీసుకున్న నిర్ణయం అభినందనీయం
-మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన రాజేశ్వరి, కిరణ్ నేత్రాలు
-నేత్రదాతల సంస్మరణ సభల్లో మేయర్ మహంకాళి స్వామి



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్ పూర్ నవంబర్ 6 : ఆప్తులను కోల్పోయిన విషాద సమయంలోనూ వారి నేత్రాలను దానం చేసి మరో ఇద్దరు అంధులకు చూపునివ్వడం గొప్ప మానవతా దృక్పథమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. నేత్రదానం చేసిన రాజేశ్వరి, బైరి కిరణ్ కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని కొనియాడారు.శుక్రవారం తిలక్‌నగర్ లో నిర్వహించిన నేత్రదాత సంస్మరణ సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు.తిలక్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ మాజీ అధ్యక్షుడు, సోషల్ మీడియా వారియర్ నంది వెంకటేష్ తల్లి రాజేశ్వరి ఇటీవల మృతి చెందారు. కార్పొరేటర్లు గట్ల రమేష్, ఎం.డి. ముస్తఫా నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బొంతల రాజేష్ సహకారంతో ఆమె నేత్రాలను దానం చేశారు. శుక్రవారం ఆమె నివాసంలో నిర్వహించిన సంస్మరణ సభకు మేయర్ మహంకాళి స్వామి, బొంతల రాజేష్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఎం.డి. ముస్తఫా, కార్పొరేటర్ గట్ల రమేష్ హాజరై నివాళులర్పించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేశారు. అదేవిధంగా బాపూజీనగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి బైరి కిరణ్ ఇటీవల మృతి చెందగా, కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. ఆయన నివాసంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు ఆరెపల్లి రాజమౌళి, కే.ఎస్. వాసు, శశికళ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అభినందన పత్రం అందజేయడంతో పాటు నేత్ర, అవయవదానంపై అవగాహన కల్పించారు.



ఘనంగా శ్రీ ధన్వంతరి నారాయణ జయంతి వేడుకలు



చురకలు,పెద్దపల్లి జిల్లా ప్రతినిధ(కమాన్ పూర్ నవంబర్) 6 : పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలో శ్రీ ఆదర్శ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీ ధన్వంతరి నారాయణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి జయంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు విష్ణు భక్తుల రవీందర్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు శ్రీనివాస్, సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీ ధన్వంతరి నారాయణ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమాజంలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతో పాటు, కుల సంఘం ఐక్యత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో నారాయణదాసు నర్సయ్య, నారాయణదాసు నంబయ్య, కొమరయ్య, రాజమల్లు, శ్రీనివాస్, వెంకటేష్, కుమార్, వివేక్, ప్రశాంత్, అజయ్, రాకేష్, నారాయణదాసు కుమారస్వామి, నాగసాగర్, శ్రీకాంత్, కుమార్, సోన్నాయిల వంశీకృష్ణ, అభిషేక్, కంది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్లకు రైడ్ ప్లేస్ ఏర్పాటు



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్‌పూర్ నవంబర్ 6 : ట్రాన్స్ జెండర్ ల కొరకు రైడ్ ప్లేస్ ఏర్పాటు చేసినట్లు పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు అన్నారు.శుక్రవారం రామగుండం సి. పి ఆదేశాల మేరకు,ట్రాన్స్ జెండర్ మహిళలకు పెద్దపెల్లి మహిళా పోలీస్ స్టేషన్ సి ఐ రమేష్ బాబు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ సెల్ గురించి అవగాహన కల్పించడం జరిగినది.తెలంగాణలో ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ అనేది ట్రాన్స్‌జెండర్లు,వర్గాల హక్కుల రక్షణ, వారి భద్రత కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక విభాగం. దీనిని 'పైడ్ ప్లేస్' అని పిలుస్తారు.కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల ప్రకారం, తెలంగాణ పోలీస్ పరిధిలోని మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక సెల్ పనిచేస్తుంది. ట్రాన్స్‌జెండర్లపై జరిగే నేరాలను అరికట్టడం, వారి గౌరవాన్ని కాపాడటం దీని ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం లొ షీ టీమ్ ఇంచార్జ్ ఎస్సై లావణ్య, మహిళా పోలీస్ స్టేషన్ రవళి, షీ టీమ్ సభ్యులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, భరోసా కో ఆర్డినేటర్ అశ్రీతా మరియు సిబ్బంది, ట్రాన్స్ ఉమెన్స్ పాల్గొన్నారు.

ఎండపల్లిలో విషాదం

-విద్యుత్ షాక్‌తో 10 నెలల చిన్నారి మృతి



చురకలు ప్రతినిధి, జగిత్యాల,నవంబర్ 6 : జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం విద్యుత్ షాక్ తో 10 నెలల చిన్నారి విభూది ఆద్య మృతి చెందింది. గ్రామంలో ఇంట్లో ఆడుకుంటున్న చిన్నారి చార్జింగ్ లో ఉన్న విద్యుత్ కాంటా (తూకం వేసే పరికరం)ను తాకడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలినట్లు తెలుస్తోంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినా అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. అప్పుడే లోకాన్ని చూస్తున్న పసిపాప అకాల మరణంతో కుటుంబంలో విషాదం నెలకొంది.గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. చిన్నపిల్లలు ఉన్న ఇళ్లలో విద్యుత్ పరికరాలు, వైర్లు అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఉచిత చెస్ట్ ఎక్స్‌రే క్యాంపు

-బండలింగంపల్లిలో 75 మంది హైరిస్క్ వ్యక్తులకు ఎక్స్‌రే పరీక్షలు



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట నవంబర్ 06 : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలినా ఆల్ఫ్రెడ్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత చెస్ట్ ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు.ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బండలింగంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్,పల్లె దవాఖాన ఆధ్వర్యంలో గ్రామంలోని సెంటర్ వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా 75 మంది హైరిస్క్ వ్యక్తులకు ఉచితంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సారియా అంజుమ్, బండలింగంపల్లి గ్రామ సర్పంచ్ బాలరాజు సర్సా గౌడ్, టీబీ సూపర్‌వైజర్లు మహిపాల్,పద్మ, ఎంపీహెచ్ఏ బాబు,ఎక్స్‌రే టెక్నీషియన్ బాలు,ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ జిల్లా లీడ్ నాగరాజు, ఏఎన్ఎంలు కమల, భారతి, సుమలత, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేట ఎస్సైగా బాలరాజు



చురకలు ప్రతినిధి,ఎల్లారడ్డిపేట నవంబర్ 06 : గంభీరావుపేట ఎస్సైగా బాలరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ బాలరాజు ప్రస్తుతం రామాయంపేట నుంచి గంభీరావుపేటకు ఎస్సైగా బదిలీపై వచ్చారు. పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

-కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 6 : హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని చౌరస్తా వద్ద శుక్రవారం 4 ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.50 కోట్లతో నాలుగు ప్రధాన కూడళ్ల అభివృద్ధి, రూ.4.5 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2.5 కోట్లతో డ్రైనేజీ పనులతో పాటు చిల్డ్రన్ పార్క్ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా రూ.58 లక్షలతో బోర్లు, హైమాస్ట్ లైట్లను మంజూరు చేయించినట్లు తెలిపారు. అనంతరం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ధర్మరాజుపల్లిలో లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 2.21 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని, నియోజకవర్గంలో మంజూరైన 5,500 ఇళ్లలో ఇప్పటివరకు 2,500 పైగా ఇళ్లు పూర్తయ్యాయని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు ప్రణవ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు బాసర జోన్ క్రికెట్ జట్ల సన్నద్ధత

చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 06 :



తెలంగాణా రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5వ తెలంగాణ పోలీస్ ఆటలు మరియు స్పోర్ట్స్ మీట్--2026 ఈ నెల 17, 18, 19 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనుంది. పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, జట్టు సమన్వయాన్ని పెంపొందించడంతో పాటు వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం ఈ క్రీడా పోటీల ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా క్లస్టర్--బి పరిధిలో నిర్వహించనున్న టీ--20 క్రికెట్ పోటీల్లో మొత్తం 21 జట్లు పాల్గొననున్నాయి. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు బాసర జోన్ క్రికెట్ జట్లు ముమ్మరంగా సాధన చేస్తున్నాయి. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా కొండాపూర్ గ్రామ సమీపంలోని లక్కీ స్పోర్ట్స్ క్రికెట్ అకాడమీలో గత రెండు రోజులుగా ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈరోజు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల క్రికెట్ అకాడమీని సందర్శించి ప్రాక్టీస్ మ్యాచ్‌లను వీక్షించారు. ఆటగాళ్ల బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ నైపుణ్యాలను, జట్టు సమన్వయాన్ని పరిశీలించి క్రీడాకారులను అభినందిస్తూ మరింత ఉత్సాహంతో సాధన చేయాలని ప్రోత్సహించారు. ప్రాక్టీస్ మ్యాచ్‌లలో పాల్గొనేందుకు నిర్మల్ జిల్లాకు విచ్చేసిన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సైతం క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొని పోలీస్ క్రీడాకారులతో కలిసి ఆట ఆడారు. అనంతరం నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, నిర్మల్ జిల్లా డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే పోలీస్ క్రీడా పోటీల్లో బాసర జోన్ క్రికెట్ జట్లు క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, అంకితభావం, జట్టు సమన్వయంతో అద్భుతమైన ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 06 :



రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గోపు తిరుపతిరెడ్డి కోరారు. తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి, పోరండ్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. తూకాల్లో ఎలాంటి మోసాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాలు పనిచేయాలని, ఈ మేరకు సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోరండ్ల సర్పంచ్ అసోద శ్రీనివాస్, మన్నెంపల్లి సర్పంచ్ పొన్నం సునీత, తిమ్మాపూర్ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, పోరండ్ల సొసైటీ వైస్ చైర్మన్ రావుల కృష్ణ, డైరెక్టర్లు ఐతం వెంకన్న, దుర్గయ్య, యాళ్ల రమ, కొండల్ రెడ్డి, పైడిపల్లి స్వామి, కనకమ్మ, పరశు రాములు, అంజయ్య, నరసింహారెడ్డి, తిరుపతి, కొమురయ్య, ఎల్లయ్య, తొర్తి అరవింద్, మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎలుక రాజు, ఆయా గ్రామాల రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సొసైటీ సీఈఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 8న ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపావళి వేడుకలు

-ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 06 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీన జిల్లాలోని ఇందిరమ్మ ఇళ్ల వద్ద ,మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి ఎంపీడీవోలు,గృహ నిర్మాణ శాఖ,జిల్లా పంచాయతీ శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల ముందు గోడలపై 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'లోగో స్టిక్కర్‌ను అతికించడంతో పాటు లబ్ధిదారుల వివరాలను నమోదు చేయాలన్నారు. లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఎదుట దీపం వెలిగించి, ఆ దృశ్యాలను ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ద్వారా ఫొటోలు తీసి, తమ సోషల్ మీడియా ఖాతాల్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వద్ద లబ్ధిదారుల కుటుంబాలతో ఫొటోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రతి గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందు, నిర్మాణం పూర్తయిన తర్వాత ఉన్న పరిస్థితులను తెలియజేసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ప్రజలకు కనిపించే ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు.తమ పరిధిలో పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను గుర్తించి, లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇతర శాఖల సిబ్బంది ఇందిరమ్మ గృహ నిర్మాణ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ పూర్తయిన ఇళ్లను సందర్శించాలని సూచించారు. లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమైన ఆనందాన్ని పంచుకోవాలని పేర్కొన్నారు.జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ క్లబ్లో ఎన్నికల కోలాహలం

-13 స్థానాలకు 31 మంది అభ్యర్థులు
-హోరాహోరీగా పోరు
-గెలుపే లక్ష్యంగా రెండు వర్గాల వ్యూహాలు
-హైదరాబాద్ కేంద్రంగా క్యాంపు రాజకీయాలు?



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 6 : హుజురాబాద్ క్లబ్ ఎన్నికలు వేడిని రాజేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలను తలపించే రీతిలో క్లబ్ ఎన్నికల సందడి నెలకొంది. గతంలో పెద్దల సమన్వయంతో కొనసాగిన క్లబ్‌కు ఈసారి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో మొత్తం 13 స్థానాలకు 31 మంది అభ్యర్థులు రెండు వర్గాలుగా విడిపోయి బరిలో నిలిచారు.

326 మంది ఓటర్లు.. నవంబర్ 15న పోలింగ్

మొత్తం 335 మంది సభ్యులు కలిగిన హుజురాబాద్ క్లబ్‌లో ప్రస్తుతం 326 మందికి ఓటు హక్కు ఉంది. ఈ నెల15న పోలింగ్ నిర్వహించనుండగా, అదే రోజు సాయంత్రం ఫలితాలను ప్రకటించనున్నారు. మొత్తం 46 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ఉపసంహరణ అనంతరం 31 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు.

పదవుల వారీగా హోరాహోరీ పోటీ

క్లబ్‌లో కీలకమైన కార్యదర్శి పదవికి కట్కూరి మల్లారెడ్డి,ముచ్చు నారాయణరెడ్డి మధ్య ప్రత్యక్ష పోటీ నెలకొంది.ఉపాధ్యక్ష పదవికి పుల్లూరి ప్రభాకర్‌రావు,కంకణాల విజయరెడ్డి, గౌరు సమ్మిరెడ్డి పోటీపడుతున్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి మంద రమేష్ (ఆర్‌కే),శవినతుని వేణు, కొమురవెల్లి హరిప్రసాద్ బరిలో ఉన్నారు.కోశాధికారి పదవికి తడికల్ శ్రీను,కొండ గణేష్ పోటీపడుతున్నారు. తొమ్మిది కార్యవర్గ సభ్యుల స్థానాలకు ఏకంగా 21 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు.వీరిలో కేసిరెడ్డి నర్సింహారెడ్డి, గడ్డం ధర్మారెడ్డి, మాగంటి శ్రీధర్, విష్ణుదాసు గోపాల్‌రావు,మేకల రాజిరెడ్డి, నూక శ్రీనివాస్,బత్తుల సమ్మయ్య, జున్నోజు రాజేందర్,పోసుగంటి శ్రవణ్‌కుమార్,గోలీ సురేష్, కోలే కల్యాణ్‌రావు,దొనకొండ సత్యనారాయణరెడ్డి,జిల్లెళ్ల భాస్కర్‌రెడ్డి, ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పుల్లూరి శ్రీకాంత్, అయ్యప్ప కొంరయ్య, వేముల మనోహర్, మొలుగురి సదయ్య, అకినపల్లి అనిల్, పలకల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ మతీన్ ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా క్యాంపు రాజకీయాలు!

ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో రెండు వర్గాల నాయకులు తమదైన శైలిలో వ్యూహాలకు పదును పెడుతున్నారు.ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. దీపావళి పండుగ ముగిసిన అనంతరం ఓటర్లను ఆకట్టుకునే లక్ష్యంతో ఒక వర్గం హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.దీంతో క్లబ్ ఎన్నికలు మరింత ఉత్కంఠభరితంగా మారాయి.

ఆధునిక వసతులతో ప్రత్యేక గుర్తింపు

2014 నుంచి మాజీ రాజ్యసభ సభ్యుడు వి.రాజేశ్వర్‌రావు,మాజీ ఎంపీపీ జగన్నాథ్ నాయుడు,మాజీ మంత్రి కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు తదితరుల సహకారంతో హుజురాబాద్ క్లబ్ అభివృద్ధి పథంలో పయనించింది. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉన్న ఈ క్లబ్‌లో జిమ్, స్విమ్మింగ్ పూల్, టెన్నిస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ వంటి ఆధునిక సదుపాయాలతో పాటు వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో జరగనున్న ఎన్నికలు క్లబ్ భవిష్యత్ నిర్వహణకు కీలకంగా మారాయి. నవంబర్ 15న జరగనున్న పోలింగ్‌పై క్లబ్ సభ్యులతో పాటు పట్టణ ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. చివరకు ఎవరి ప్యానల్ విజయం సాధిస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

పారాచూట్ లీడర్‌ను కాదు.. నిరుద్యోగుల కన్నీళ్లు తెలిసిన వాడిని

-13 ఏళ్లుగా నిరుద్యోగుల మధ్యే నా ప్రయాణం
-ఎన్నికలప్పుడే సమస్యలు గుర్తుకొచ్చే వారికి పట్టభద్రులే బుద్ధి చెబుతారు
-కోట్ల లాభాల టర్నోవర్లు వాళ్లు చూస్తే.. నాలుగు గోడల మధ్య నిరుద్యోగుల కన్నీటి వ్యథలను చూశా
-ప్రత్యర్థులపై మెండేం కిరణ్ కుమార్ నిప్పులు



చురకలు ప్రతినిధి,హనుమకొండ, నవంబర్ 06 : స్వలాభం కోసం ఎన్నికల సమయంలో ప్రత్యక్షమై పట్టభద్రుల ఓట్లు పొందాలని చూసే పారాచూట్ నాయకుడిని తాను కాదని,13 ఏళ్లుగా నిరుద్యోగ యువత మధ్య ఉంటూ వారి సమస్యలు, ఆవేదనలు,కన్నీళ్లను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తినని నల్గొండ- వరంగల్- ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి మెండేం కిరణ్ కుమార్ స్పష్టం చేశారు. కోట్ల రూపాయల లాభాలు, వ్యాపార టర్నోవర్లు సంపాదించే కాంగ్రెస్,బీఆర్ఎస్ అభ్యర్థులకు నిరుద్యోగుల కుటుంబాల్లోని కన్నీటి వ్యథలు కనిపించవని, ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ ఎన్నో ఆశలు, కలలతో జీవిస్తున్న యువత వేదన తనకు తెలుసని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలు గుర్తుకొచ్చే నాయకులకు ఈసారి పట్టభద్రులే తమ ఓటుతో బుద్ధి చెబుతారని ఘాటుగా వ్యాఖ్యానించారు.హన్మకొండలోని గోకుల్ నగర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం మెండేం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం,ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ మేళా నిర్వహించారు.కార్యక్రమానికి వేలాది మంది పట్టభద్రులు హాజరయ్యారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ..అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఎన్ఆర్ఐలుగా విదేశాల్లో ఉంటూ కోట్లాది రూపాయల సంపద కూడబెట్టుకుని, ఇప్పుడు ఆ ఆర్థిక బలాన్ని నిరుద్యోగుల ఆశలకు పెట్టుబడి గా వెదజల్లి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. తాను మాత్రం సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, నిరుద్యోగుల కష్టాలను,వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులను, ఉద్యోగం సాధించాలన్న వారి తపనను దగ్గరగా అర్థం చేసుకున్నానని తెలిపారు .నిరుద్యోగుల బాధలను కేవలం ప్రసంగాలకే పరిమితం చేయకుండా రైట్ చాయిస్ అకాడమీ ద్వారా వారి ఉద్యోగ కలలను నిజం చేసే దిశగా రేయింబవళ్ళు శ్రమించానని పేర్కొన్నారు.విదేశాల్లో సంపాదించిన కోట్ల రూపాయలతో నిరుద్యోగుల ఆశలను కొనలేరని,వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చే కార్యాచరణ,నిరంతర ప్రజా సంబంధాలే నాయకత్వానికి అసలైన కొలమానాలని స్పష్టం చేశారు.తన 13 ఏళ్ల ప్రయాణం పదవులు,రాజకీయ ప్రయోజనాల చుట్టూ తిరగలేదని, నిరుద్యోగుల సమస్యలు,వారి భవిష్యత్తు కోసమే సాగిందని అన్నారు.ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ కుటుంబాల బాధ్యతలు మోస్తున్న యువత మనోవేదనను ప్రత్యక్షంగా చూశానని, నాలుగు గోడల మధ్య వారు పడే కన్నీటి కష్టాలు తనకు తెలుసునని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో మాత్రమే నిరుద్యోగుల సమస్యలను ప్రస్తావించి,ఆ తర్వాత వారిని విస్మరించే నాయకుల మాటలను పట్టభద్రులు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. పట్టభద్రుల ఎన్నికలు డబ్బు, అర్థాటాలు,రాజకీయ పలుకుబడికి వేదిక కాకూడదని,నిరుద్యోగుల భవిష్యత్తు, పట్టభద్రుల హక్కులు, ఉద్యోగ అవకాశాల కోసం నిరంతరం పనిచేసే నాయకత్వాన్ని గుర్తించాలని కిరణ్ కుమార్ కోరారు.ఈ సమ్మేళనంలో పట్టభద్రులతో ఆత్మీయంగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలనే లక్ష్యంతో ప్రత్యేక ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టభద్రులు స్వచ్ఛందంగా పాల్గొనడం తో కార్యక్రమం ఉత్సాహ భరితంగా సాగింది.ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు చెర్రీ ప్రవీణ్,నవీన్ పట్నాయక్, బాల కోటి,మిత్ర,స్మార్ట్ ప్రవీణ్,శింబు, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అభిరామ్,చందు, ఖజురో పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్ఓసీ అందజేసిన కేంద్రమంత్రి "బండి"

అనారోగ్యంతో బాధపడుతున్న కన్నాపూర్ కుమార్‌కు ఎల్ఓసి అందజేత

చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 6 : శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి కుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని నిమ్స్ ఆసుపత్రికి ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. ఈ ఎల్ఓసీని బాధిత కుటుంబానికి అందజేయడంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ప్రత్యేక చొరవ చూపించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కనకం సాగర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు, గద్దపాక గ్రామ ఉపసర్పంచ్ జంగా జైపాల్, ముత్తారం గ్రామ బూత్ అధ్యక్షుడు కనకం రాజయ్య తదితరులు పాల్గొన్నారు. విపత్కర పరిస్థితుల్లో తమ కుటుంబానికి అండగా నిలిచి వైద్య ఖర్చుల కోసం ఎల్ఓసీ అందించిన ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు తాళ్లపల్లి కుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

-లూసియానా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డుల కొరకు దరఖాస్తుల ఆహ్వానం



-డా: కాయితి శంకర్, స్టేట్ -కో ఆర్డినేటర్

చురకలు ప్రతినిధి,జగిత్యాల నవంబర్ 06 : సమాజంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి లూసియానా యూనివర్సిటీ అమెరికా వారు గౌరవ డాక్టరేట్ అవార్డు మరియు ఇంటర్నేషనల్ అవార్డుల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కాయితి శంకర్ శుక్రవారం పత్రిక ప్రకటన లో తెలిపారు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20 తేది లోపు 9491322556 నెంబర్ కు దరఖాస్తు పంపాలని కోరారు సెలక్షన్ అయిన వారికి ఈ నెల13తేదినవ దేశరాజధాని డిల్లీలో 29వ తేదిన కలకత్తాలో అవార్డు,మెడల్ సర్టిఫికెట్ ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

అత్తను ఇంట్లోంచి గెంటేసిన కోడలు



చురకలు విలేకరి, జగిత్యాల,నవంబర్ 6 : జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపులాపూర్ కు చెందిన నార్నేని కౌసల్య (75)అనే వృద్ధ అత్త తన కోడలు పద్మ పోషణ, వైద్య ఖర్చులు పెట్టక కొట్టి ఇంట్లోంచి గెంటి వేసిందని జగిత్యాల జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది. కాగా శుక్రవారం సీనియర్ సిటిజెన్స్ ప్రతినిధులతో వెళ్లి ఆర్డీవో కు ఫిర్యాదు చేయగా వయో వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఆ వృద్ధ అత్త సీనియర్ సిటిజెన్స్ కార్యాలయం లో తన గోడు విలేకరులకు వినిపించారు. తన మరణించిన భర్త కిషన్ రావు పేరిట ఉన్న భూములను తన కోడలు పద్మ అక్రమంగా తన పేరిట పట్టా చేయించుకొని నన్ను పోషించాలని కోరితే తన కోడలు పద్మ, మనుమడు వాసురావులు కొట్టి ఇంట్లోంచి వెళ్ళగొట్టారని, తన కోడలు తన ఇంటిలో నన్ను ఉంచుకొని తనను పోషిస్తూ ప్రతి నెలా రూ. 10 వేలు పోషణ వైద్య ఖర్చులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, తన మరణించిన భర్త కిషన్ రావు పేరిట అక్రమంగా చేయించుకున్న భూముల పట్టా రద్దు చేసి తన పేరిట మార్పించాలని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ను ఆశ్రయించి ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా తన కోడలు, మనుమడి పై కేసు నమోదు చేశారని, ఎస్పీ కి సైతం ఫిర్యాదు చేస్తానని ఆ వృద్ధ అత్త విలేకరుల ముందు ఏడుస్తూ చెప్పింది. ఆ వృద్ధ అత్త వెంట ఆమె బంధువులు, సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, చట్టం కాన్సిలియేషన్ అధికారులు పి. సి. హన్మంత్ రెడ్డి, వెల్ముల ప్రకాష్ రావు, తదితరులున్నారు.

దడ పుట్టిస్తున్న.. శంకరపట్నం ఎస్ఐ కట్కూరి శేఖర్ రెడ్డి

-శాంతిభద్రతలపై నిరంతర నిఘా

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 6 : సంఘ వ్యతిరేక శక్తుల్లో, అక్రమార్కుల్లో శంకరపట్నం ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి దడ పుట్టిస్తున్నారు. ఎస్సైగా గత కొద్ది కాలంగా పనిచేస్తున్న శేఖర్ రెడ్డి తన పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. మండలంలో శాంతిభద్రతలపై నిరంతర నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు వివాదాలను పరిష్కరిస్తూ తనదైన శిరిడిలో ముందుకు పోతున్నారు. అలాగే పలు అంశాలపై ప్రజల్లో యువతలో చైతన్యం కలిగిస్తున్నారు.



శాంతిభద్రతల విషయంలో..

శాంతిభద్రతలపై శంకరపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారు. శంకరపట్నం మండలాన్ని కలుపుతూ జాతీయ రహదారి వెళ్తుండడంతో ఎప్పటికప్పుడు పెట్రోల్ నిర్వహిస్తున్నారు. శంకరపట్నం మండల కేంద్రం లో గతంలో కంటే నిఘా పెంచారు. అలాగే మెట్పల్లి ఆమదాలపల్లి తాడికల్ వంటి పెద్ద గ్రామాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఎక్కడ ఎలాంటి వివాదాలు జరిగినా గొడవలు జరిగిన వెంటనే సమాచారం వచ్చే విధంగా తన నెట్వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. ఒకవైపు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండానే.. వివాదాలు శాంతి భద్రతల సమస్యగా దారితీయకుండా.. ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ చేసి.. కోర్టులను ఆశ్రయించి సమస్య పరిష్కరించుకోవాలని, లేకుంటే పెద్దమనుషుల సమక్షంలో కూర్చొని రాజీ పడాలని అంతేకానీ శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఎస్సై పేరును పలువురు ప్రశంసిస్తున్నారు.

యువత పై దృష్టి

శంకరపట్నం మండలంలో ప్రతి గ్రామంలోనూ సుమారు 200 ఉంటున్నారు. ఇందులో కొందరు మధ్యలోనే చదువు ఆపివేసిన వారు ఉండగా మరికొందరు డిగ్రీలు పీజీలు చేసి ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారు కూడా ఉన్నారు. మరికొందరు చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నారు. వీరందరికీ సైబర్ నేరాలపై అలాగే మత్తు పదార్థాలు డ్రగ్స్ తదితర అంశాలకు దూరంగా ఉండాలంటూ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. అలాగే యువత తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని, పట్టుదలతో పని చేయాలని కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ పై..

రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా ఎస్సై శేఖర్ రెడ్డి దృష్టి పెట్టారు. జాతీయ రహదారి తో పాటు గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపులను, అలాగే తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. అక్కడక్కడ హెచ్చరిక బోర్డులను చొరవ తీసుకొని ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు సిబ్బందిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ అవినీతికి దూరంగా ప్రజలతో మమేకమై పోలీసు శాఖ పనితీరును మెరుగుపరిచేందుకు ఎస్సై శేఖర్ రెడ్డి తీసుకుంటున్న చర్యలను మండల ప్రజలు ప్రశంసిస్తున్నారు.

దీపావళి కాంతుల వేళ... కంటికి భద్రం!

చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి, జబ్బార్ ఖాన్) నవంబర్ 6 : చీకట్లను పారద్రోలుతూ వెలుగులు నింపే దీపావళి పండుగ వచ్చెనంటే చిన్న పెద్ద తేడా లేకుండా అందరిలోనూ ఉత్సాహం వెల్లివిరుస్తుంది. రంగురంగుల దివ్వెలు, సందడి చేసే తపాసులు పండుగ శోభను రెట్టింపు చేస్తాయి. అయితే, ఈ ఆనందాల వేళ చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాంతం చీకట్లను నింపే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా బాణసంచా కాల్చే సమయంలో మన శరీరంలో అత్యంత సున్నితమైన అవయవమైన 'కళ్ళు' తీవ్ర ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఎక్కువ. పండుగ వేళ కంటి చూపు భద్రంగా ఉండటానికి తీసుకోల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకాంశం...



ప్రమాదాలకు కారణాలు – సాధారణంగా జరిగే పొరపాట్లు:

సమీపం నుండి కాల్చడం :

రాకెట్లు, కాకరపువ్వులు, లక్ష్మీబాంబులు వంటివి వెలిగించేటప్పుడు చాలా దగ్గరగా ఉండటం వల్ల ఒక్కసారిగా వచ్చే నిప్పురవ్వలు కంట్లో పడే ప్రమాదం ఉంది.

తుపాకీ మందు పొగ : బాణసంచా పొగలో విషపూరితమైన రసాయనాలు (సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మొదలైనవి) ఉంటాయి. ఇవి కళ్ళలో మంటలు, ఎరుపుదనం మరియు నీళ్ళు తిరగడానికి కారణమవుతాయి.

కాల్చని బాణసంచాను మళ్ళీ పరిశీలించడం : సరిగ్గా వెలగని తపాసులను దగ్గరకు వెళ్ళి చూడటం, లేదా చేతులతో పట్టుకోవడం వల్ల అవి ఒక్కసారిగా పేలి తీవ్ర గాయాలవుతాయి.

తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు:

రక్షణ కళ్ళద్దాలు బాణసంచా కాల్చేటప్పుడు వీలైతే ప్లాస్టిక్ లేదా ఫైబర్ తో చేసిన రక్షణ కళ్ళద్దాలు ధరించడం మంచిది. ఇవి నిప్పురవ్వలు నేరుగా కంటిపై పడకుండా అడ్డుకుంటాయి.

సురక్షితమైన దూరం:

బాణసంచా వెలిగించేటప్పుడు కనీసం ఒక చేయి దూరం లేదా దానికి తగినంత సురక్షిత దూరంలో ఉండాలి.చిన్నపిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.

కాంటాక్ట్ లెన్స్‌లు వద్దు:

పండుగ రోజు బాణసంచా కాల్చే సమయంలో కాంటాక్ట్ లెన్స్‌లు ధరించకపోవడమే మంచిది. వేడికి మరియు పొగకు లెన్స్‌లు కంటి పొరలకు అతుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. సాధారణ అద్దాలు ధరించడం శ్రేయస్కరం.

నీళ్ళ బకెట్ సిద్ధంగా ఉంచుకోవాలి:

బాణసంచా కాల్చే ప్రదేశంలో ముందు జాగ్రత్తగా ఒక బకెట్ నిండా నీళ్ళు ఉంచుకోవాలి. వెలిగించిన కాకరపువ్వులు, చిచ్చుబుడ్ల పుల్లలను వెంటనే నీటిలో వేయాలి.

అనుకోకుండా కంటిలో ప్రమాదం జరిగితే... ఏమి చేయాలి? ఏమి చేయకూడదు?చేయకూడనివి

కంటిని నలపవద్దు:

కంటిలో నిప్పురవ్వ లేదా నలుసు పడితే తక్షణమే కంటిని రుద్దడం లేదా నలపడం చేయకూడదు. దీనివల్ల కంటి రెటీనా లేదా నల్లపాపపై గీతలు పడి ప్రమాదం తీవ్రమవుతుంది.

స్వయం వైద్యం వద్దు:

వైద్యుని సలహా లేకుండా ఎలాంటి కంటి చుక్కల మందులు వేయకూడదు.

రక్షిత నీటితో శుభ్రం చేయడం:

కంట్లో రసాయనాలు లేదా పొగ పడితే స్వచ్ఛమైన, చల్లని నీటితో కంటిని నిధానంగా కడగాలి.

వెంటనే వైద్యుడిని సంప్రదించడం:

కంటికి గాయమైనా, వేడి తగిలినా ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని నేత్ర వైద్య నిపుణుడినసంప్రదించాలి.వెలుగుల పండుగ దీపావళిని సురక్షితంగా, బాధ్యతాయుతంగా జరుపుకుందాం... మన కంటి వెలుగులను కాపాడుకుందాం!

జాగ్రత్తలు తప్పకుండా పదాలి.

పూదరి దత్త గౌడ్

నేత్ర వైద్య సహాయకులు



దీపావళి బాంబులు కాల్చేటప్పుడు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలి.చిన్న పిల్లలను దూరంగా ఉంచితే చాలా మంచిది.చాలావరకు అజాగ్రత్త వల్లే బాంబుల వల్ల కంటికి దెబ్బలు తగ్గుతాయి.ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకొని పండుగను శుభప్రదంగా చేసుకోండి.



కోరుట్ల, మెట్‌పల్లిలో పౌరసరఫరాల శాఖ ఆకస్మిక తనిఖీలు



-రెండు దుకాణాల్లో ధరల ట్యాంపరింగ్ కేసులు నమోదు

చురకలు, ప్రతినిధి కోరుట్ల నవంబర్ 06 : కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు శుక్రవారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి,తూనికలు–కొలతల శాఖ అధికారులతో కలిసి రెండు హోల్‌సేల్ దుకాణాలు, ఆరు రిటైల్ దుకాణాలు, ఒక రైస్ మిల్లును తనిఖీ చేశారు.మార్కెట్‌లో బియ్యం కృత్రిమ కొరత సృష్టించకుండా, అధిక ధరలకు విక్రయించకుండా చూడటమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రెండు వ్యాపార సంస్థలు బియ్యం బస్తాలపై అసలు ధరల లేబుళ్లను మార్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. అలాగే దుకాణాలు, గోదాముల్లో బియ్యం నిల్వలు, ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి దుకాణం, మిల్లు వద్ద రోజువారీ నిల్వలు, విక్రయ ధరల వివరాలను వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్,జీఎస్టీ,ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి పత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.26 కిలోల బస్తా పేరుతో 24 లేదా 25 కిలోల బియ్యం విక్రయించినా, తూకాల్లో తేడాలు చూపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అక్రమ నిల్వలు, ధరల ట్యాంపరింగ్,నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే వ్యాపారులపై నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఈ ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

"సర్కార్ దవాఖానా"ను తనిఖీ చేసిన కాంగ్రెస్ నేత ప్రణవ్



-వైద్య సేవలపై ఆరా -సమస్యల పరిష్కారానికి హామీ

చురకలు ప్రతినిధి హుజూరాబాద్, నవంబర్ 6 : హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ శుక్రవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందులు, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని సందర్శించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. రోగులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైద్యశాలలో నెలకొన్న సమస్యలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో చర్చించానని, రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.